ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు


ఘట్‌కేసర్‌లో ఇందిరాగాంధీ జయంతిలో వజ్రేశ్‌యాదవ్ తదితరులు

మేడ్చల్: దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మేడ్చల్ పట్టణంలో, వివిధ గ్రామాల్లో పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేడ్చల్ పట్టణంలోని కింది బస్తీలో గల ఇందిరమ్మ విగ్రహంకు, గౌడవెల్లి, డబీల్‌పూర్, శ్రీరంగవరం తదితర గ్రామాలలో ఇందిరమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి ఆమె దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోచయ్య, శ్రీనివాస్‌రెడ్డి నర్సింహ్మారెడ్డి, రమణారెడ్డి, మల్లేష్‌గౌడ్, మహేష్, శేఖర్‌గౌడ్, బాలమల్లేష్, మాజీ సర్పంచ్ సంజీవరావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో..

ఘట్‌కేసర్: మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ జయంతిని కాంగ్రెస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో, అలాగే ఘనాపూర్‌లో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్, బీ–బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు గోపాల్‌రెడ్డి, యాదగిరియాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేష్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ మశ్చేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు మల్లేష్, రవీందర్, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, ఎఫ్‌ఎస్‌సీఎస్ డైరెక్టర్లు అంజిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు అనిత, జంగయ్యముదిరాజ్, శ్రీనివాస్, నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కీసరగుట్టలో.. స్వామి కళ్యాణోత్సవంలో ఆలయ చైర్మన్, భక్తులు తదితరులు

వైభవంగా శ్రీరామలింగేశ్వరుడి కల్యాణోత్సవం


కల్యాణోత్సవ ఉత్సవ మూర్తులు

కీసర: కార్తీక మాసోత్సవాల ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం కీసరగుట్టలో శ్రీ భవానీ శివదుర్గా సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి కల్యాణోత్సవాన్ని అర్చకులు కన్నుల పండువగా అత్యంత వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గర్భాలయంలో కొలువైన శ్రీ స్వామివారికి (శివలింగం)కు పండితులు క్షీరాభిషేకం నిర్వహించారు.


స్వామివారికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రగతి చక్రాల పురస్కారాల అందజేత


పురస్కారాలతో ఆర్టీసీ ఉద్యోగులు

మేడ్చల్: సెప్టెంబర్ నెలలో మేడ్చల్ ఆర్టీసీ డిపోలో ఉత్తమ సేవలందించిన ఆర్టీసీ డ్రైవర్లకు, కండక్టర్లకు యాజమాన్యం ప్రగతి చక్రాల పురస్కారాలను అందజేశారు. డిపో మేనేజర్ సుధాకర్ ఇతర అధికారులు ఆర్టీసీ డ్రైవర్లకు, కండక్టర్లకు, మెకానిక్‌లకు సన్మానం నిర్వహించి అవార్డులను అందజేశారు. వెల్ఫేర్ బోర్డు మెంబర్‌లుగా ఎన్నికైన కిషన్, భూంరెడ్డిలను సన్మానించారు. సమావేశంలో డిపో అధికారులు రామారావు, స్నేహలత, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబీకులను పరామర్శించిన చైర్‌పర్సన్

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని కొండాపూర్‌లో అనారోగ్యంతో మరణించిన ఆగేష్‌ముదిరాజ్ కుటుంబీకులను మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్యయాదవ్ పరామర్శించారు. మంగళవారం ఉదయం మృతుడి నివాసానికి వెళ్లి అంత్యక్రియల నిమిత్తం రూ. 5 వేలు అందజేశారు. కార్యక్రమంలో జంగయ్యయాదవ్, నాగరాజ్‌ముదిరాజ్, వెంకటేష్, స్థానికులు పాల్గొన్నారు.

భూసర్వేను నిలిపివేయాలని తహసీల్దార్‌కు వినతి


తహసీల్దార్‌కు వివరిస్తున్న ఏకశిలనగర్ ప్లాట్ల యజమానులు

ఘట్‌కేసర్: భూసర్వేను నిలిపివేయాలని ఏకశిలనగర్ ప్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు తహసీల్దార్ రజినికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. కొర్రెముల్‌లోని సర్వేనంబర్ 739–479లోని 149 ఎకరాల్లో 1985లో ఏకశిల నగర్ పేరుతో వెంచర్ ఏర్పాటు చేశారని, తిరిగి 2005లో బిల్డర్ వెంకటేష్ తప్పుడు పత్రాలతో పట్టాదారు పాస్ పుస్తకాలు పొంది తమను ఇబ్బందులు పెడుతున్నాడని తహసీల్దార్‌కు ఇచ్చిన వినతిలో ఆరోపించారు. వెంచర్‌గా ఏర్పడిన అనంతరం తిరిగి పట్టాదారు పుస్తకాలు ఎలా జారీ చేస్తారని, ఆ భూమిని ఎలా సర్వే చేస్తారని ప్రశ్నించారు. తప్పుడు పత్రాలతో దస్తావేజులు సృష్టించి సర్వే చేయాలంటున్న బిల్డర్ వెంకటేష్‌కు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. వెంటనే సర్వేను నిలుపుదల చేయాలని కోరారు.

ఎన్యూమరేషన్ బ్లాక్ సూపర్‌వైజర్లకు ట్రైనింగ్


మాట్లాడుతున్న తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్

శామీర్‌పేట్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో సందేహాలు, ఎదురవుతున్న సమస్యలపై మంగళవారం తూంకుంట మున్సిపాలిటీ కార్యాలయంలో ఎన్యూమరేషన్ బ్లాకు సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తూంకుంట మున్సిపాలిటీ, శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాలకు చెందిన 22 మంది ఎన్యూమరేషన్ బ్లాకు సూపర్‌వైజర్లకు ట్రైనింగ్ సెషన్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో శామీర్‌పేట ఎంపీడీఓ మమతాబాయి, మూడుచింతలపల్లి ఎంపీడీఓ వత్సలదేవి, తూంకుంట కమిషనర్ వెంకటగోపాల్, వివిధ మండలాల ఎంపీఓలు పాల్గొన్నారు.

వచ్చే నెల 3న బీఆర్ఎస్ జిల్లా ఆఫీస్ ప్రారంభం

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల భేటీలో నిర్ణయం
- ప్రారంభించనున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి,సిటీబ్యూరో: వచ్చే నెల 3న ప్రారంభించనున్న బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవం కార్యక్రమానికి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించాలని ఆ పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల సమావేశం నిర్ణయించింది. మంగళవారం పేట్ బషీరాబాద్‌లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. డిసెంబర్ 3వ తేదీన ఉదయం 11 గంటలకు గండి మైసమ్మలోని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ రానున్న నేపథ్యంలో జిల్లా నలుమూలల నుంచి పార్టీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, సభ్యులు, యువజన విభాగం నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, సభ్యులు, కార్యకర్తలు, అభిమానులను పెద్ద ఎత్తున హాజరయ్యేలా కృషి చేయాలని తీర్మానించారు. ఈ మేరకు జిల్లాలోని అన్నీ అసెంబ్లీ నియోజకవర్గాలు, గ్రామాలు, పురపాలక సంఘాలు, డివిజన్ల నుంచి పార్టీ కార్యకర్తలను తరలించాలని నాయకులకు వారు పిలుపునిచ్చారు.

సమాజానికి మంచి చేయాలి



శామీర్‌పేట్: సమాజానికి మంచి చేసినపుడే గుర్తింపు లభిస్తుందని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులుయాదవ్ అన్నారు. మూడుచింతలపల్లి మండలం, కొల్తూర్ గ్రామానికి చెందిన బాలకృష్ణ ఇటీవల విశ్వకర్మ జాతీయ స్థాయి అవార్డు అందుకున్న సందర్భంగా ఆయనను ఎంపీపల్లి మండల వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి నర్సింహులుయాదవ్ మంగళవారం శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శిల్పాయాదగిరి, గ్రామ అధ్యక్షుడు నర్సారెడ్డి, మాజీ ఎంపీటీసీలు అనంతరెడ్డి, వెంకటేష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో సుమారు 21 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆయన మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డులో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేయడం జరగుతుందన్నారు. కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపూర్‌లో కుంగిన బ్రిడ్జి


కుంగిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: వెంకటాపూర్‌లో ఇటీవల కుంగిన బ్రిడ్జిని చైర్మన్ కొండల్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిడ్జి వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా కోన్ పోల్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలో మరమ్మతులు చేపడతామని చెప్పారు. కమిషనర్ వీరారెడ్డి, ఏఈ మహిపాల్, నాయకులు శ్రీనివాస్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా ఘట్‌కేసర్ 33/11కేవీ సబ్‌స్టేషన్, ఘట్‌కేసర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఘట్‌కేసర్ టౌన్, సాయినగర్ కాలనీ, టీచర్స్ కాలనీ, మున్సిపల్ కార్యాలయం, అంబేద్కర్ నగర్, ఘట్‌కేసర్–ఎదులాబాద్ మెయిన్ రోడ్డు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, బుగ్గానగర్, బ్రూక్‌బాండ్ కాలనీ, లింగాలకుంట పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

మేడ్చల్‌లో.. కిష్టాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో, కిష్టాపూర్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా నేడు పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ రాంబాబు తెలిపారు. కిష్టాపూర్ గ్రామంతో పాటు అన్ని పరిశ్రమలకు ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

శామీర్‌పేట్‌లో.. నేడు శామీర్‌పేట సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని శామీర్‌పేట ఏఈ రాఘవేందర్‌రావు పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. 11కేవీ నల్సార్ ఫీడర్, 33/11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నల్సార్‌లా యూనివర్సిటీ, పెద్దమ్మకాలనీ, సెలబ్రిటీ రిసార్ట్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

గుండ్లపోచంపల్లి పరిధిలో.. సాయి గీత ఆశ్రమం ఫీడర్ పరిధిలోచెట్ల కొమ్మల నరికివేత కారణంగా నేడు పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. ప్రెస్టేజ్ పార్క్, ఆంతమ్ విల్లాస్, పోలీస్‌ట్రైనింగ్, సెంటర్, మైపి విల్లాస్, కేవీ రెడ్డి నగర్, ఆనందొరెడ్డి గోదాంలలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

కీసరలో.. చక్రిపురం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ బాబురెడ్డినగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా నేడు (బుధవారం) ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు నాగారం మున్సిపల్ పరిధిలోని శిల్పానగర్, మోడి అపార్ట్‌మెంట్, లావణ్య ఎన్‌క్లేవ్, ప్రగతి ఎన్‌క్లేవ్, చక్రాధర ఎన్‌క్లేవ్, బాబురెడ్డికాలనీ, లోటస్‌కాలనీ, వికాస్‌నగర్, లక్ష్మీనగర్, ఏరియాలో విద్యుత్ అంతరాయం ఉంటుందని, ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని, విద్యుత్ ఏఈ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

మేడ్చల్‌రూరల్‌లో.. కండ్లకోయ సబ్ స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఏఈ విజయ్‌కుమార్ పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. 11కేవీ సాయి గీత ఆశ్రమం, 33/11కేవీ ఫీడర్ పరిధిలో ట్రీ కటింగ్‌తో పాటు మరమ్మతుల కారణంగా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రెస్టీజ్ పార్క్, లంతం విల్లాస్, పోలీస్ ట్రైనింగ్ సెంటర్, కెవి రెడ్డి కాలనీ, ఆనంద్‌రెడ్డి గోడౌన్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వివరించారు.

పోచారంలో.. విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మల తొలగింపు చర్యలు చేపట్టినందున బుధవారం కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అన్నానగర్, డాక్టర్స్ కాలనీ, జోడిమెట్ల చౌరస్తా, అరుంధతి కాలనీ, చౌదరిగూడ ప్రాంతాలకు, మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు పోచారం, డాక్టర్స్ కాలనీ, విజయసాయి ఎన్‌క్లేవ్ ప్రాంతాలకు కరెంట్ ఉండదని ఏఈ తెలిపారు.

‘ప్రజా కళాయాత్ర’ను ప్రారంభించిన అదనపు కలెక్టర్



సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా ప్రజాపాలన–ప్రజా విజయోత్సవాలు– 2024 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు మంగళవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో ప్రజా కళా యాత్రను జెండా ఊపి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) రాధికా గుప్తా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)విజయేందర్‌రెడ్డి, డీఆర్ఓ హరిప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. తెలంగాణ సాంస్కృతిక కళాకారులు నవంబర్ 19 నుంచి డిసెంబర్ 7 వరకు ప్రతి రోజు 3 గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల పై ప్రచారం నిర్వహించనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్లు తెలిపారు. ఇందులో కలెక్టరేట్ పరిపాలన అధికారి రాంమోహన్, డీఆర్డీఓ అధికారి సాంబశివరావు, జిల్లా ఎస్సీ అభివృద్ధిశాఖాధికారి వినోద్ కుమార్, కలెక్టరేట్ సిబ్బంది, టీఎస్ఎస్ కళాకారులు పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాల పై కళాకారులు పాటలు పాడారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి


కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్నకాలనీవాసులు

బోడుప్పల్: వాసవీనగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కమిటీ ప్రతినిధులు 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేశ్‌యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వాసవీనగర్ కాలనీ కమిటీ నూతనంగా ఎన్నికైన సందర్భంగా కార్పొరేటర్‌ను కలిసి సత్కరించారు. అనంతరం కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. కాలనీ అధ్యక్షుడు మోహన్ బాబు, ఉపాధ్యక్షుడు కిశోర్‌కుమార్, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, కోశాధికారి సాయిగణేష్, మాజీ ప్రతినిధులు కోటేశ్వర్‌రావు, సహోదర్‌రెడ్డి తదితరులున్నారు.

పరామర్శ



మల్కాజిగిరి: ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మల్కాజిగిరికి చెందిన జర్నలిస్ట్ లక్ష్మారెడ్డిని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి సూర్య ఆసుపత్రిలో పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును లక్ష్మారెడ్డిని, చికిత్స గురించి డాక్టర్ జగదీష్‌బాబును అడిగి తెలుసుకున్నారు. లక్ష్మారెడ్డికి తక్షణ సాయంగా రూ.50 వేలు అందజేశారు.

నియామకం



ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ పరిధిలో హరిహర క్షేత్ర ఫైనాన్స్ కమిటీ కన్వీనర్‌గా బాలచందర్‌ను మంగళవారం నియమించారు. ఇటీవల ఆలయ పునర్నిర్మాణ నూతన కమిటీ అధ్యక్షులు దాసరి కృష్ణ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాదాపుగా రూ. 6 కోట్లతో నిర్మిస్తున్న ఆలయాన్ని నిర్మించడం తెలిసిందే. కన్వీనర్ దేవసాని బాలచందర్ గతంలో శ్రీరామ జన్మభూమి రామాలయ నిర్మాణంలో కూడా విశేష కృషి చేసి విరివిగా విరాళాలు సేకరించారని పలువురు ప్రశంసించారు.

బాక్స్‌డ్రైయిన్ పనుల పరిశీలన


ఇంజినీరింగ్ అధికారులతో కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ విమలాదేవినగర్ నుంచి ఓల్డ్ మల్కాజిగిరి సరికొండ నర్సింహారెడ్డి గార్డెన్స్ వరకు బాక్స్‌డ్రైయిన్ నిర్మాణం నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కార్పొరేటర్ శ్రవణ్ ఆదేశించారు. మంగళవారం బాక్స్ డ్రైయిన్ పనులను ఆయన పరిశీలించారు. సుమారు రూ. 2 కోట్లతో చేపట్టిన పనులు భజరంగ్ స్టోర్స్ నుంచి రాజీవ్‌నగర్ వరకు పూర్తయ్యాయన్నారు. రోడ్డు నిర్మాణం చేయకుండా వేరేచోట పనులు ప్రారంభించడం సరికాదన్నారు. ట్రాఫిక్ అధికారులతో చర్చించి డైవర్షన్‌తో పాటు పనులు పూర్తిచేసే గడువును పేర్కొంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించామన్నారు. ఈఈ లక్ష్మణ్, డీఈ మహేష్, ఏఈ నవీన్, వీఐ రమేష్, పవన్,రవి,స్వాతి పాల్గొన్నారు.